సాక్షి
పార్వతీపురం మన్యం
శుక్రవారం ၊ 8 ၊ ఆగస్టు ၊ 2025



అడవితల్లి ఒడిలో ప్రశాంత జీవనం
నవ్యసమాజానికి దూరంగా కొండకోనల్లో జీవనం సాగించే వారే గిరిపుత్రులు. కొండకోనల్లో ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయాల నడుమ ఆదివాసీల జీవనం వైవిధ్యంగా సాగుతోంది. - 8లో



ముర్రుపాలు అమూల్యం
బిడ్డ పుట్టిన ఐదు నిమషాలలోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు ఎంతో అమూల్యమైనవని కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్ అన్నారు. - 8లో



శాఖాపరంగా సిబ్బంది సమస్యల పరిష్కారం - 8లో
జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి అన్నారు.

న్యూస్‌రీల్

జిల్లాకు 2,13,000 ఆల్బెండజోల్ మాత్రల సరఫరా


జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు

పార్వతీపురం టౌన్: జిల్లాకు 2,13,000 ఆల్బెండజోల్ మాత్రలు సరఫరా చేసినట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్. భాస్కరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 1,96,612 మంది అంగన్వాడీ, పాఠశాల, కళాశాల పిల్లలు, విద్యార్థుల లక్ష్యంగా ఆల్బెండజోల్400 మి.గ్రా మాత్రలు వేయించనున్నామని తెలిపారు. ఈ నెల 12న జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్న డీవార్మింగ్ కార్యక్రమానికి జిల్లాకు సరఫరా చేసిన ఆల్బెండజోల్ మాత్రలను ఆయా వైద్యాధికారులు, సిబ్బందికి పంపిణీ చేశామని తెలిపారు. ఈ నెల 12న మాత్రలు వేసుకోని వారికి ఈనెల 20న మాప్‌అప్ కార్యక్రమంలో మాత్రలు వేసేలా చర్యలు చేపట్టామన్నారు.

జిల్లా ఆస్పత్రిలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్


జిల్లా ఆస్పత్రిలో కేన్సర్ వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పార్వతీపురం టౌన్: మహాత్మాగాంధీ కేన్సర్ హాస్పిటల్-రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ వారి సహకారంతో పార్వతీపురం మన్యం జిల్లా కేంద్రాస్పత్రిలో మెగా ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి జి.నాగభూషణ రావు మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. జిల్లా ఆస్పత్రి, పార్వతీపురం మెడికల్ సూపరింటెండెంట్ డా.వై.నాగశివ జ్యోతి పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించారు. పార్వతీపురం పరిసర ప్రాంతాల్లో ఉన్న సుమారు 176 మందికి పరీక్షలు నిర్వహించి వారిలో 65 మందికి ఓరల్ కేన్సర్ స్క్రీనింగ్ చేశారు. వారిలో 4 అనుమానిత కేసులుగా, 1 నాలుకకు సంబంధించిన కేన్సర్‌గా నిర్ధారణ చేశారు. బ్రెస్ట్ కేన్సర్ పరీక్షలను 91 మందికి నిర్వహించి వారిలో 20 మందిని అనుమనితులుగా గుర్తించి డిజిటల్ మెమోగ్రఫీ పరీక్ష చేశారు. దీని ద్వారా వారిలో ఎవరికీ కేన్సర్ లేదని నిర్ధారించారు. 20 మందికి గర్భసంచి ముఖద్వారం కేన్సర్ పరీక్షలు నిర్వహించి వారిలో 10 మందిని అనుమానితులుగా గుర్తించి పరీక్షలు చేశారు. వాటి రిపోర్టులను వారం రోజులలో అందించనున్నారు. కార్యక్రమంలో డా.హారిక, డా.కె.పాల్, మెమోగ్రఫీ టెక్నీషియన్స్ లక్ష్మి, జి.సుమన్, జిల్లా ఆస్పత్రి దంత వైద్యసిబ్బంది డా.ఎం.దినేష్ కుమార్, డా.ఆర్.శ్యామల పాల్గొన్నారు.

గాయత్రీమాతకు పసుపు కొమ్ములతో అలంకరణ


పసుపు కొమ్ములతో అలంకరించిన గాయత్రీమాత

రాజాం సిటీ: రాజాం గాయత్రికాలనీలో వెలసిన గాయత్రిమాతను పసుపు కొమ్ములతో ఆలయ ధర్మకర్త కొండవేటి వివేకానంద, ఆలయ అర్చకులు వాన జగదీశ్వరరావు గురువారం అలంకరించారు. శ్రావణ మాసంలో వచ్చే మూడో శుక్రవారాన్ని పురస్కరించుని అమ్మవారిని అలంకరించినట్లు అర్చకులు తెలిపారు.

సీసీ కెమెరాలతో నిఘా

విజయనగరం క్రైమ్: విజయనగరం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం కొత్తగా 16 సీసీ కెమెరాలను అమర్చారు. నేర నియంత్రణలో భాగంగా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు వైఎస్సార్ నగర్, మెడికల్ కాలేజ్, కాటవీధి, డబుల్ కాలనీ తదితర చోట్ల సీసీ కెమెరాలు పెట్టామని సీఐ శ్రీనివాస్ తెలిపారు. వీటి సాయంతో నేర ప్రవృత్తికలిగిన వ్యక్తుల కదలికలపై నిఘావేస్తామన్నారు.

పల్లె కంటకన్నీరు..!

గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి గత ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తే.. ప్రస్తుత ప్రభుత్వం పల్లెలను బలహీన పరుస్తోంది. పంచాయతీలకు నిధులు విడుదల చేయకుండా అభివృద్ధి పనులకు ఆటంకం కలిగిస్తోంది. పంచాయతీ ఖజానాలు ఖాళీ అయిపోవడంతో పారిశుద్ధ్య నిర్వహణ, వీధి దీపాల వెలుగులు, గ్రామాల్లో కనీసం చెత్త తీయిద్దామన్నా, బ్లీచింగ్ చల్లుదామన్నా నిధులు లేక పంచాయతీలు ఉసూరు మంటున్నాయి. ఫలితంగా గ్రామాల్లో అభివృద్ధి మొత్తంగా పడకేసింది.

-సాక్షి, పార్వతీపురం మన్యం/ పాలకొండ రూరల్/మక్కువ

- గ్రామాల్లో కానరాని పనులు
- క్షీణిస్తున్న పారిశుద్ధ్యం
- వెంటాడుతున్న వసతుల కొరత
- పంచాయతీల నిధులకు ఎగనామం
- నేటికీ విడుదల కాని ఆర్థికసంఘం సొమ్ము


పంచాయతీలో చెత్తను తీస్తున్న పారిశుద్ధ్య కార్మికుడు

పల్లెలకు ఏడాది పైబడి 'చంద్ర' గ్రహణం పట్టింది. స్థానిక సంస్థలను ప్రోత్సహించాల్సిన ప్రభుత్వం ఒక్క అడుగు కూడా ముందుకు వేయడం లేదు. సంపద సృష్టించి క్షేత్రస్థాయిలో అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామన్న సీఎం చంద్రబాబు వాస్తవ విరుద్ధంగా పాలన సాగిస్తున్నారు. పంచాయతీలకు పట్టుగొమ్మ వంటి ఆర్థిక సంఘాల నిధులు పక్కదారి పట్టించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు సక్రమంగా విడుదల చేయడం లేదు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గత ఏడాది నవంబర్ నెలలో తొలి విడత నిధులు గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లాపరిషత్‌లకు విడుదల చేశారు. రెండవ విడత నిధులు తాజా ఏడాది మార్చిలోగా విడుదల చేయాల్సి ఉంది. కానీ విడుదల చేయలేదు. దీంతో పంచాయతీలు ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటులపై ఆధారపడాల్సిన స్థితి నెలకొంది. నెలల తరబడి నిధులు విడుదల కాకపోవడంతో పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. దీంతో పారిశుద్ధ్య నిర్వహణ పనులు పడకేశాయి. వీధి దీపాలు, సిబ్బందికి జీతాలు, ఫినాయిల్, బ్లీచింగ్ పౌడర్ తెచ్చేదెలా అని పంచాయతీల ప్రథమ పౌరులు ప్రశ్నిస్తున్నారు. కనీసం హరిత రాయబారులకు జీతాలు కూడా చెల్లించలేని స్థితిలో పంచాయతీలున్నాయి.

అభివృద్ధి పనులపై ప్రభావం..

గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు జనాభా ప్రాతిపదికన కేంద్రం ఏటా ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేస్తుంది. ఏడాదిలో రెండు విడతలుగా ఈ నిధులను జమ చేస్తుంది. టైడ్, బేసిక్ గ్రాంట్ల రూపంలో విడుదల చేసే ఈ నిధులను ఆర్థిక సంఘం మార్గదర్శకాల మేరకు స్థానిక సంస్థలు వినియోగించాలి. బేసిక్ గ్రాంట్‌ను గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, కమ్యూనిటీ హాళ్లు, శ్మశాన వాటికల అభివృద్ధి, వీధిలైట్ల నిర్వహణ తదితర పనులకు వెచ్చించాలి. టైడ్ గ్రాంట్‌ను పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సరఫరా, ఓడీఎఫ్ అమలు తదితర ప్రాథమిక అవసరాలకు ఖర్చుచేయాలి. కేంద్రం నుంచి ఈ నిధులు తొలుత రాష్ట్ర ప్రభుత్వానికి చేరుతాయి. అక్కడి నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సంఘం కేటాయింపుల మేరకు పంచాయతీలకు జమ చేస్తుంది. 16వ ఆర్థిక సంఘం నిధులు కూడా ఈ సమయానికి విడుదల చేయాలి. 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల కాకపోవడంతో వాటికీ మోక్షం కలగడం లేదు.

- నిధుల విడుదలలో జాప్యంతో గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఆటంకం ఏర్పడుతోంది. ఉపాధి నిధులతో చేపడుతున్న పనులే దిక్కవుతున్నాయి.
- ఇంటి పన్నుల మీద వచ్చే ఆదాయం సిబ్బంది జీతభత్యాలు, వీధి దీపాల నిర్వహణకే సరిపోతోంది. కొన్ని పంచాయతీల్లో పూర్తిగా నిధులు లేకపోవడంతో వీధి దీపాలు వెలగడం లేదు.
- పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. దోమలు అధికమయ్యాయి. ఫలితంగా వైరల్ జ్వరాలు, రోగాలు ముసురుకుంటున్నాయి.
- ప్రస్తుతం జిల్లా యంత్రాంగం బహిరంగ మల విసర్జనను అధిగమించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఓడీఎఫ్ ప్లస్‌కు ప్రణాళిక రూపొందిస్తోంది. 26 వేల వరకు వ్యక్తిగత మరుగుదొడ్లు అవసరం. నిధులు లేక ఈ పనులకూ అంతరాయం ఏర్పడుతోంది.
- ఇంటింటా చెత్త సేకరణ కోసం బుట్టలు, చెత్త తరలింపు వాహనాలూ కొనుగోలు చేయలేని పరిస్థితి ఉంది.

జిల్లా వివరాలు...	
పార్వతీపురం మన్యం జిల్లాలోని మండలాలు	15
పంచాయతీలు	451
నివాస గృహాలు	సుమారు 2.13 లక్షలు
జనాభా	దాదాపు 7.40 లక్షల మంది
బకాయిలు ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులు	సుమారు రూ.10 కోట్లు

నిధులు లేవు..



గ్రామాల పురోభివృద్ధి ఆర్థిక సంఘం నిధులపై ఆధారపడి ఉంటుంది. ఇది కూడా సంబంధిత శాఖ మంత్రి పట్టించుకోకపోవడం అన్యాయం. ప్రస్తుత వర్షాకాల సీజన్‌లో పంచాయతీ ఖాతాల్లో నిధులు లేక అభివృద్ధి పనులతోపాటు రోజువారీ పనులకు ఆటంకం ఏర్పడుతోంది. మేజర్ పంచాయతీలకు ఆదాయ వనరులు ఉంటాయి. మైనర్ పంచాయతీల పరిస్థితి ఏమిటి? గ్రామాల్లో కనీసం చెత్తను తీయిద్దామన్నా, బ్లీచింగ్ చల్లుదామన్నా దిక్కులు చూడాల్సి వస్తోంది. సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోతున్నాం. – టి.ఉపేంద్రకుమార్, సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షుడు, లుంబూరు గ్రామ పంచాయతీ, పాలకొండ మండలం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం..



ఏడాది కాలంగా గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నాయి. ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయడం లేదు. పల్లెల్లోకి వెళితే ప్రజలు మమ్మల్ని ప్రశ్నిస్తున్నారు. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉంటామన్న కూటమి ప్రభుత్వం..నేడు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీకి చెంది ప్రజా ప్రతినిధులు 95 శాతంపైబడి ఉండడంతో ఇలా వేధిస్తోంది. ప్రజల్లో సర్పంచులను బలహీనపర్చేలా యత్నిస్తున్నట్లు భావించాల్సి వస్తోంది.

– బొత్తాడ గౌరీ శంకరరావు, సర్పంచ్, గుమలక్ష్మీపురం మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు

జీతాలు కూడా ఇవ్వలేని స్థితిలో పంచాయతీలు



ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత కొత్తగా నిధులు విడుదల కాలేదు. దీంతో సొంత నిధులు వెచ్చించి గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, వీధిదీపాలు, ఇతర పనులు చేయించుకుంటున్నాం. కనీసం గ్రీన్ అంబాసిడర్ల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో పంచాయతీలు ఉన్నాయి.

– సీహెచ్ సీతారామకృష్ణ, సర్పంచ్, పణుకువలస పంచాయతీ, పాచిపెంట మండలం

ప్రజల అవస్థలకు ప్రభుత్వానిదే బాధ్యత



ఈ ఏడాది ఆగస్టు నాటికి 16వ ఆర్థిక సంఘం నిధులు తొలి విడత విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం అలా జరగలేదు. పలు గ్రామాల సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేపట్టేందుకు సొంత నిధులు ఖర్చు చేస్తున్నారు. వారిపై ఆర్థిక భారం పడుతోంది. దీనిపై సంబంధిత శాఖ మంత్రి స్పందించకపోవడం విడ్డూరంగా ఉంది. గత ప్రభుత్వ హయాంలో గ్రామ సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నిరంతర పర్యవేక్షణ ఉండేది. పంచాయతీల్లో ప్రజలు పడుతున్న అవస్థలకు కూటమి ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది. – విశ్వాసరాయి కళావతి, మాజీ ఎమ్మెల్యే, పాలకొండ

నాటు తుపాకులు కలిగి ఉండడం చట్టరీత్యా నేరం

- ఎస్పీ ఎస్వీ మాధవ్ రెడ్డి


పార్వతీపురం మండలం కొత్తవలసలో పోలీసులు స్వాధీనం చేసుకున్న నాటు తుపాకీ

పార్వతీపురం రూరల్: నాటు తుపాకులు కలిగి ఉండడం వాటిని వినియోగించడం చట్టరీత్యా నేరమని ఎస్పీ ఎస్వీ మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా వ్యాప్తంగా ప్రజల రక్షణ, భద్రత ప్రామాణికంగా, నేరాలు, అక్రమ రవాణా నియంత్రణే లక్ష్యంగా 'కార్డన్ అండ్ సెర్చ్' ఆపరేషన్ ను సంబంధిత స్టేషన్ల అధికారులు నిర్వహించారు. ఈ క్రమంలో పార్వతీపురం మండలం రావికోన పంచాయతీ కొత్తవలస గ్రామంలో పార్వతీపురం రూరల్ పోలీసులు ఆపరేషన్ నిర్వహిస్తుండగా కొర్ర సీతారాం ఇంటి గడపలో నాటు తుపాకీని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి నాటు తుపాకులు కలిగి ఉండడం, లైసెన్స్ లేకుండా తుపాకులు వినియోగించడం చట్టరీత్యా నేరం అన్న విషయాన్ని గ్రామస్తులకు అర్థమయ్యే రీతిలో సిబ్బందితో కలిసి అవగాహన కల్పించారు.

భక్తులను ఆకర్షించేలా తోటపల్లి ఆలయ నిర్మాణం

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


అన్నప్రసాద సత్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్


కలెక్టర్‌కు వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం భక్తులకు ఆధ్యాత్మిక చింతన మరింత చేరువ చేసి ఆకర్షించేలా ఆలయాల నిర్మాణాలు చేపట్టనున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన దేవస్థానంలో నూతనంగా నిర్మించిన వాన ప్రస్తాశమం, అన్నప్రసాద సత్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తోటపల్లిలో వెలసిన శ్రీ వెంకటేశ్వరస్వామి ప్రభావం ఈ ప్రాంతంపై ఎంతో ఉందన్నారు.భక్తుల ఇలవేల్పుగా, ఈ ప్రాంతానికి చిన తిరుపతిగా తోటపలి దేవస్థానాన్ని కొనియాడుతున్నారన్నారు. ఆలయ నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకోవడంతో ఈ ప్రాంతంలోని ఆధ్యాత్మిక భావాలు కలిగిన వారంతా ఒక్కటై ఆలయ అభివృద్ధికి ట్రస్టును ఏర్పాటు చేసి ఆలయ పునర్నిర్మాణానికి కంకణం కట్టుకున్నారని చెప్పారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు నిర్మాణాలు జరగడంతో ఆలయానికి కొత్త శోభ వచ్చిందన్నారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణానికి, అభివృద్ధి పనులకు సహకరించిన పలువురు దాతలను కలెక్టర్ అభినందించారు. అనంతరం కలెక్టర్‌ను దుశ్శాలువతో సన్మానించి, వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని ట్రస్ట్ సభ్యులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వీవీ సూర్యనారాయణ, సర్పంచ్ ఆవాల సింహాచలమమ్మ, ఎంపీటీసీ ఎం.సింహాచలం నాయుడు, ట్రస్ట్ సభ్యులు డి. పారినాయుడు, డి.ధనుంజయ రావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

పి.ఆమిటిలో ఆదివాసీ దినోత్సవం


పి.ఆమిటి పాఠశాలలో ఆదివాసీ దినోత్సవంలో బాలికల సందడి

గుమ్మలక్ష్మీపురం: ప్రపంచ ఆదివాసీ దినోత్సవం (ఈ నెల 9)ను పురస్కరించుకొని గుమ్మలక్ష్మీపురం మండలంలోని పి.ఆమిటి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఆదివాసీ ఉత్సవాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆ పాఠశాల హెచ్ఎం బిడ్డిక లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో విద్యార్థినులంతా గిరిజన సంప్రదాయ వేషధారణలతో అలరించారు. సంప్రదాయ పూజలు, నృత్యాలతో ఆకట్టుకున్నాయి.

ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చాటిచెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీచర్ ఎం.రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

వట్టిగెడ్డ నీరు.. ఒట్టిదేనా!


వర్షపు నీరుతో 86 అడుగులకు నీటి మట్టం చేరిన వట్టిగెడ్డ

వట్టిగెడ్డ.. జియ్యమ్మవలస మండలంలోని మూడు మండలాల్లోని పంట భూములకు సాగునీటి ఆదరువు. వరినాట్లు ముమ్మరంగా జరిగే ఆశ్లేషకార్తె వచ్చినా జలాశయం నుంచి చుక్కనీరు రావడం లేదు. కనీసం నీరు విడిచిపెట్టాలన్న ధ్యాస స్థానిక ఎమ్మెల్యేకు లేకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. వరి నారుమడులు, వెదలు ఎండిపోతున్నాయని, ఇంకెప్పుడు నీరు విడిచిపెడతారని ప్రశ్నిస్తున్నారు.

- ఆగస్టు వచ్చినా అందని సాగునీరు
- ఆయకట్టు రైతుల్లో ఆందోళన
- ఎమ్మెల్యే ఏం చేస్తున్నట్లు?

జియ్యమ్మవలస రూరల్: కురుపాం. జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లో దాదాపు 16,500 ఎకరాలకు సాగునీటిని అందించే వట్టిగెడ్డ.. ఇంకా రైతులకు ఎదురు చూపులే మిగులుస్తోంది. జియ్యమ్మవలస మండలంలోని ప్రధాన సాగునీటి వనరు వట్టిగెడ్డ జలాశయం. ఏటా ఖరీఫ్‌లో సాగునీరు విడుదల చేస్తారు. ఆగస్టు రెండు, మూడు తేదీల్లోనే ఈ ప్రక్రియ జరిగిపోతుంది. కుడి, ఎడమ కాలువలు వరుసగా 9.75, 8.047 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నాయి. వట్టిగెడ్డ నుంచి కుడి కాలువ ద్వారా 13,324 ఎకరాలు, ఎడమ కాలువ ద్వారా 3,360 ఎకరాలకు సాగుకు నీరు అందించాల్సిఉంది. ఆగస్టు 8వ తేదీ వచ్చినా నేటికి నీటి విడుదల జాడ లేదు. నీటి విడుదల లేక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు నాలుగు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. నాట్లు పడక నారు మడులు, వరి వెదలు ఎండిపోతున్నాయి. వట్టిగెడ్డ రిజర్వాయర్ పరిధిలో ఒకసారే వరి పంట రైతులు పండిస్తున్నారు. ఈ సంవత్సరం సాగునీరు సకాలంలో అందకపోతే రైతులు నష్టపోయే పరిస్థితి ఉంది. ప్రాజెక్టు నిర్వహణ సిబ్బంది కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు. కాలువలకు ప్రతీ 5 కిలోమీటర్లకు, డిస్ట్రిబ్యూటర్ల వద్ద 1500 ఎకరాలకు ఒక్కొక్కరు చొప్పున లస్కర్లు ఉండాలి. మొత్తం 23 మంది అవసరం. కానీ ప్రస్తుతం ఒక్కరే ఉన్నారు. ఈ నెల ఆరో తేదీన స్థానిక కూటమి ఎమ్మెల్యే జగదీశ్వరి వట్టిగెడ్డ నుంచి సాగునీటిని విడుదల చేస్తారని కూటమి నాయకులు ప్రకటించారు. తేదీ గడిచినా సాగునీరు మాత్రం విడుదల చేయలేదు. ఇటు ఎమ్మెల్యే జాడ కూడా కానరావడం లేదు. రైతుల కోసం కనీసం ఆలోచించకపోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.


విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

సాగునీటిని వెంటనే విడిచిపెట్టాలి

రావాడ వట్టిగెడ్డ రిజర్వాయర్ సాగునీటిని వెంటనే కుడి, ఎడమ ప్రధాన కాలువల ద్వారా విడిచిపెట్టాలని జియ్యమ్మవలస మండల వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. చినమేరంగిలోని శత్రుచర్ల కోటలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఏటా ఈ సమయానికే సాగునీటిని ఇరిగేషన్ శాఖ ఇంజినీరింగ్ అధికారులు విడిచిపెట్టేవారని, నేడు ఏడవ తేదీ అవుతున్నా విడుదల చేయకపోవడం తీవ్ర అన్యాయమన్నారు. నీరు లేక ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలు అధికారులకు కనించడం లేదా? అని ప్రశ్నించారు. తక్షణమే నీరు విడుదల చేయకపోతే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇరిగేషన్ కార్యాలయం ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ కోట రమేష్, వైస్ ఎంపీపీ గుడివాడ సంపత్ కుమార్, బలగ వెంకటరమణ, లోలుగు నారాయణరావు, పోల గోవిందరావు, తాడేల మన్మధరావు, బెజ్జిపొరపు మురళి పాల్గొన్నారు.

సరైన రీతిలో బోధించాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్


విద్యాశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్

పార్వతీపురం రూరల్: జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సరైన రీతిలో ఉపాధ్యాయులు బోధన చేసి నాణ్యమైన విద్యను అందించడం ద్వారా వారిలో జ్ఞానాన్ని, నైపుణ్యాలను పెంచవచ్చునని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అభిప్రాయపడ్డారు. అందుకు తగిన ప్రణాళికలు జిల్లా విద్యాశాఖ చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఆయన అధ్యక్షతన పాఠశాల విద్య, సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా బోధనలో మార్పులు రావాలని, ఈ మేరకు ఉపాధ్యాయులకు శిక్షణ అవసరమన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజన విద్యార్థులకు బోధించేందుకు లాంగ్వేజ్ పండిట్‌లను నియమించాలని, అలాగే విద్యార్థులకు అందించే విద్యా బోధనతో పాటు వారి ఆరోగ్యంపై కూడా దృష్టిసారించడం ముఖ్యమని దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డీఈఓ రాజ్‌కుమార్, ఏపీసీ తేజేశ్వరావు, ఎస్‌జీటీ వనజాక్షి, మరికొంతమంది ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పలు కార్యక్రమాలపై సమీక్ష

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ పలు కార్యక్రమాలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ గురువారం తన కార్యాలయంలోని సమావేశ మందిరం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎరువుల పర్యవేక్షణ పటిష్టంగా ఉండాలని పీ4, డాక్యుమెంటేషన్ అప్‌లోడ్, మౌలిక సదుపాయాల కల్పన, ఎరువుల పంపిణీ ప్రక్రియ వంటి కార్యక్రమాపై సమీక్షించాలని, అలాగే ఎరువుల విషయంలో అవసరాలను ముందుగా గుర్తించి చర్యలకు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తెలియజేసినట్లు కలెక్టర్ తెలిపారు. అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ యాక్టివ్, ఇన్‌యాక్టివ్ ఖాతాలను పరిశీలించాలని తెలియజేసినట్లు తెలిపారు. పీ4లో మార్గదర్శి, బంగారు కుటుంబాలు అనుసంధానం సర్వే తదితర అంశాలను పూర్తి చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, డీఆర్ఓ కె. హేమలత, డిప్యూటీ కలెక్టర్ దిలీప్ చక్రవర్తి, డ్వామా పీడీ కె. రామచంద్రరావు, డీఆర్‌డీఏ పీడీ ఎం.సుధారాణి, డీఎంహెచ్ఓ ఎస్.భాస్కరరావు, ఆర్‌బీఎస్‌కే జిల్లా అధికారి జగన్‌మోహన్ రావు, జిల్లా సర్వే అధికారి లక్ష్మణరావు, ప్రకృతి వ్యవసాయం డీఎం శ్యామ్ కుమార్, డీపీఓ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు వెంపడాం విద్యార్థులు



రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పూసపాటిరేగ: మండలంలోని వెంపడాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 3 వతేదీన విజయనగరంలోని విజ్జీ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల ఎంపికలలో పాఠశాలకు చెందిన పి.వెంకటలక్ష్మి (లాంగ్‌జంప్), వి.కల్యాణి (హై జంప్), పి.శ్రీను (100 మీటర్లు, 200 మీటర్లు రన్నింగ్)లు ఎంపికయ్యారు. దీంతో ఈనెల 9,10 తేదీలలో రాష్ట్రస్థాయిలో బాపట్ల జిల్లా చీరాలలో జరగబోయే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొననున్నారు. పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంతో పాఠశాల హెచ్‌ఎం పి.లచ్చన్న, పీడీ గణేష్‌కుమార్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

జాతీయ పోటీల్లో దివ్యాంగ విజేతకు అభినందనలు



దివ్యాంగ విజేతను అభినందిస్తున్న సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ రామారావు

విజయనగరం అర్బన్: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్‌లో మేధోవైకల్యం గల ప్రత్యేక అవసరాల పిల్లలకు ఇటీవల జరిగిన జాతీయ స్థాయి స్పెషల్ ఒలింపిక్ గేమ్స్ బేస్‌బాల్‌లో కాంస్యపతక విజేత అయిన తెర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని తోషినిని జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు, సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ ఎ.రామారావు అభినందించారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని వారి కార్యాలయాలకు వచ్చి అధికారులను తోషిని కలిసింది. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సాధారణ విద్యార్థుల మాదిరిగానే ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులు కూడా ప్రతిభ చూపడం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. అనంతరం విజేతను, కోచ్‌లుగా వ్యవహరించిన పి.సునీల్, ఎస్.బంగారునాయుడిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎస్.సూర్యారావు, సహ సమన్వయకర్త ఎం.భారతి, తెర్లాం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎస్ఎం రమేష్, కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నాటుతుపాకీతో ఇద్దరి అరెస్ట్



అరెస్ట్ చేసిన వ్యక్తులతో సీఐ అప్పలనాయుడు, ఎస్సై సుదర్శన్ సిబ్బంది

వేపాడ: మండలంలోని సోంపురం గ్రామంలో నాటుతుపాకీ ఉన్నట్లు అందిన సమాచారం మేరకు తనిఖీ చేయడంతో నాటుతుపాకీ పట్టుబడినట్లు ఎస్సై సుదర్శన్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన అందించిన వివరాలిలా ఉన్నాయి. సోంపురం గ్రామానికి చెందిన గొర్లె ఈశ్వర్రావు ఇంటిలో తనిఖీలు నిర్వహించగా నాటుతుపాకీ పట్టుబడినట్లు చెప్పారు. తుపాకీపై ఆరాతీయడంతో గుడివాడ గ్రామానికి చెందిన రొంగలి బంగారయ్య వద్ద రూ.4500కు కొనుగోలు చేసినట్లు ఈశ్వర్రావు తెలిపాడని చెప్పారు. ఎటువంటి ప్రభుత్వ అనుమతులులేకుండా తుపాకీ కలిగి ఉన్నందున ఈశ్వర్రావును, నాటు తుపాకీ అమ్మడం చట్ట రీత్యా నేరమైనందున విక్రయించిన బంగారయ్యను ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు అరెస్టు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆర్టీసీ డార్మిటరీలో వ్యక్తి మృతి



ఆర్టీసీ డార్మిటరీలో మృతి చెందిన కృష్ణమూర్తి

విజయనగరం క్రైమ్: విజయనగరం ఆర్టీసీ డార్మిటరీలో ఓ వ్యక్తి మృతి చెందాడు. దీనిపై వన్ టౌన్ పోలీసులకు గురువారం అందిన ఫిర్యాదు మేరకు స్టేషన్ హెచ్‌సీ ఆవాల రమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విశాఖ జిల్లా తగరపువలసకు చెందిన సబ్బిశెట్టి కృష్ణమూర్తి(54) శశికాలేజీలో కుక్‌గా పని చేస్తున్నాడు. మందుల కోసం విజయనగరం వచ్చి రాత్రి కావడంతో ఆర్టీసీ డార్మిటరీలో రూమ్ తీసుకుని ఉండిపోయాడు. నిద్ర సమయంలోనే గుండె పోటు రావడంతో మృతి చెంది ఉండవచ్చని మృతుడి అల్లుడు మక్కడపల్లి శ్రీనివాస్ చేసిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డెస్‌డ్	స్కిన్‌లెస్
₹105	₹180	₹190

అడవితల్లి ఒడిలో ప్రశాంత జీవనం

- చూడముచ్చటగా కట్టుబొట్టు, ఆచారాలు
- కొండపోడే ఆధారంగా జీవనం
- మౌలికవసతులు అంతంతమాత్రమే
- ప్రపంచ ఆదివాసీ దినోత్సవం రేపు



గిరిజన సంప్రదాయ వెదురు కూరను వంటకు సిద్ధం చేస్తున్న వృద్ధురాలు

సీతంపేట: నవ్యసమాజానికి దూరంగా కొండకోనల్లో జీవనం సాగించే వారే గిరిపుత్రులు. కొండకోనల్లో ప్రత్యేక భాష, సంస్కృతి, సంప్రదాయాల నడుమ ఆదివాసీల జీవనం వైవిధ్యంగా సాగుతోంది. కాయకష్టం చేసి జీవించడం వారి జీవన విధానం. భిన్నమైన సంస్కృతి, సంప్రదాయాలు గిరిజనుల సొంతం. కొండల్లో తమ సంప్రదాయ



ఐటీడీఏలో ఆదివాసీ తల్లి విగ్రహం

వ్యవసాయాన్ని చేసుకుంటూ జీవిస్తున్న గిరిజనుల ఆచార వ్యవహారాలు, కట్టుబొట్టుల్లో మార్పులేదు. అటవీఉత్పత్తుల సేకరణ, పోడుపంటలు, వ్యవసాయ పంటల దిగుబడులు వచ్చినప్పుడు గిరిజనులు ప్రత్యేక పండగలు జరుపుకోవడం ఆనవాయితీ.

విభిన్నం-వైవిధ్యం..

సంప్రదాయ ఆచార వ్యవహారాల్లో ఎంతో వైవిధ్యం కనబరిచే గిరిజనులు అటవీ సంస్కృతికి ప్రతీకలు. ఘన చరిత్రకు వారసులు. వారి ఆధ్యాత్మిక చింతన వినూత్నం.వారి కట్టూ బొట్టూ చూడ ముచ్చటగా ఉంటాయి. తెల్లారితే కొండపోడు వ్యవసాయం, అటవీఉత్పత్తుల సేకరణతోనే వారి జీవనం సాగుతుంది. ప్రతి మూడు నెలలకు ఒక్కో అటవీ ఉత్పత్తుల సీజన్ ఆరంభమవుతుంది. పైనాపిల్, సీతాఫలం, పసుపు, జీడి, కందులు, నిమ్మ, బత్తాయి, పెండలం ఇలా అటవీ ఉత్పత్తులతోనే వారి జీవనం ముడిపడి



నృత్యాలు చేస్తున్న ఆదిమ గిరిజనులు (ఫైల్)

ఉంది. వారం వారం జరిగే వారపు సంతలకు వెళ్లి వారి ఉత్పత్తులు విక్రయించి వారానికి సరిపడా నిత్యావసర సరుకులు కొనుగోలు చేసుకుంటారు.

సీతంపేట ఐటీడీఏ పరిధిలో 819 కిలోమీటర్ల మేర ఏజెన్సీ విస్తరించి ఉంది. 42 వేల 246 గిరిజన కుటుంబాల్లో 2లక్షల 62వేల మంది కుటుంబ సభ్యులున్నారు. మొత్తం 1187 గిరిజన గూడలుండగా వాటిలో ఆదిమ గిరిజనులు నివసించే గూడలు 467 ఉన్నాయి. గిరిజనుల్లో ప్రధానంగా కొండ సవర, జాతాపు, కాపు సవర తెగలున్నాయి. వివాహాలు, పండగలు, వ్యవసాయం తదితర సందర్భాల్లో ప్రత్యేక పండగలు నిర్వహించుకోవడం ఎంతో వైవిధ్యం. భార్యకు కట్నం ఇచ్చి వివాహం చేసుకునే 'మొగనాలి' ఇప్పటికీ కొన్ని చోట్ల అమల్లో ఉంది.

అభివృద్ధికి ఆమడదూరంలో..

మన్యంలో గిరిజనుల అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. గిరిజనులకు మౌలికవసతులు లేక అల్లాడుతున్నారు. విద్య, వైద్యం, రవాణా సౌకర్యాలు చాలా గ్రామాలకు లేవు. రక్షిత మంచీనీటి వ్యవస్థ అందుబాటులో లేదు. అనాదిగా గిరిజనులు ప్రకృతి ఆధారంగానే



పండగలో ఆదివాసీ దేవతలకు పూజలు చేస్తున్న గిరిజనులు



రేషన్ మోసుకుంటూ ఇంటికి తీసుకు వెళ్తున్న మహిళలు

జీవన మనుగడ సాగిస్తున్నారు. సుమారు 120కి పైగా గ్రామాలకు రహదారి సౌకర్యం ఇప్పటికీ లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

అంతంతమాత్రంగా వైద్యసేవలు

ఎపిడమిక్ సీజన్‌లో ఏజెన్సీలో మలేరియా విజృంభిస్తుంది. పీహెచ్‌సీల్లో డాక్టర్ల కొరత వేధిస్తోంది. ఇప్పటి వరకు దోమతెరల పంపిణీ లేదు. ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వైద్య సేవల కోసం ఇంతవరకు హెల్త్ వలంటీర్‌లను నియమించలేదు. పాఠశాలల్లో కనీస మౌలికవసతులైన మరుగుదొడ్లు, అదనపు తరగతుల గదుల సమస్యలు వేధిస్తున్నాయి. గిరిజనోత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేవు. అన్ని అటవీ ఉత్పత్తులు జీసీసీ కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. ముఖ్యంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఇంటింటికి రేషన్ ఇవ్వడం కోసం ప్రవేశపెట్టిన ఎండీయూ వాహనాలు రద్దు చేయడంతో రేషన్ కొండలపైకి మోసుకుని తీసుకువెళ్తూ గిరిజనులు పడుతున్న ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.

ఆదివాసీ దినోత్సవం నిర్వహణ ఎందుకంటే..

ఆదివాసీల జీవన స్థితిగతులను ప్రపంచానికి తెలియజేసేందుకు ఐక్యరాజ్యసమితి 1194 ఆగస్టు 9న జెనీవాలో ప్రపంచ ఆదివాసీ వర్కింగ్ గ్రూప్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ వర్కింగ్ గ్రూప్ ఆదివాసీలపై అధ్యయనం చేసి ప్రపంచ దేశాల్లో ఆదివాసీల సమస్యలన్నీ దాదాపు ఒకేలా ఉన్నాయని గుర్తించింది. దీంతో ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహించాలని యూఎన్‌వో ప్రకటించింది.

కొండపోడే ఆధారం..

పోడు వ్యవసాయం ప్రధాన జీవనాధారంగా కుటుంబాలతో ఆనందంగా జీవిస్తారు. భూ ఉపరితలానికి అత్యంత ఎత్తైన భాగంలో గూడల్లో నివసిస్తూ భయమంటే తెలియదన్నట్లు క్రూరమృగాల నడుమ, విష సర్పాల పడగ నీడలో సాహస జీవితం గడుపుతుంటారు. జిల్లాలోని అటవీ ప్రాంతమంతా ప్రకృతి సోయగాలతో అలరారుతుంది.

అక్షరాలే ఆరాధ్యదేవతలు-లిపివారిప్రాణం..

శ్రీకాకుళం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో మరో వైవిధ్యముంది. ఇక్కడ అక్షరాలను ఆరాధ్యదేవతలుగా గిరిజనులు పూజిస్తారు. ఏ దేవతకైనా పూజలు చేసినా నైవేద్యంగా సారా పెట్టి పూజ అనంతరం పూటుగా తాగుతారు. జీలుగు సారా వంటివి చెట్టునుంచి దించితే ముందుగా తెద్దులతో సేవిస్తారు. వారి పండగలు, సంప్రదాయాలను బొమ్మల రూపంలో వేయడంలో వారికి వీరేసాటి. ఏజెన్సీలో అక్షరబ్రహ్మ, మడిబ్రహ్మ వంటి ఆలయాలు వెలిశాయి. అక్కడి గిరిజనులు ప్రతి గురువారం పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇంకా కొన్ని ప్రాంతాల్లో ఆగం పండగ వంటివి చేస్తుంటారు. సవర లిపి ద్వారా కొంతమంది ఆదిమ గిరిజనులు జీవనం సాగిస్తున్నారు. వారు వేసే లిపికి మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది. ఇటీవల కాలంలో దీనిని అభివృద్ధి చేస్తున్నారు.

అర్ధరాత్రి ఈదురుగాలులు

- విద్యుత్ వైర్లపై పడిన చెట్టుకొమ్మలు



వీరఘట్టం: మండల వ్యాప్తంగా బుధవారం అర్ధరాత్రి భారీగా ఈదురుగాలులు వీచాయి. అయితే వర్షం పడుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. ఈదురుగాలుల ధాటికి స్థానిక దుర్గగుడి సమీపంలో ఉన్న ఓ భారీ వృక్షం చెట్టుకొమ్మలు బుధవారం అర్ధరాత్రి 1 గంట సమయంలో విరిగి పడ్డాయి.ఈ చెట్టుకొమ్మలు విరిగి పక్కనే ఉన్న విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ వైర్లు చెల్లాచెదురుగా తెగిపడ్డాయి.రెండు విద్యుత్ స్తంభాలు పాక్షికంగా వాలిపోయాయి. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.వెంటనే ఏఈ అనిల్‌కుమార్, లైన్‌మెన్ సింహాచలం, రవి, పవన్, సురేష్‌లు సంఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ సరఫరా నిలిపివేశారు. అనంతరం చెట్టు కొమ్మలు తొలగించి వీరఘట్టం మండలకేంద్రానికి తాత్కాలికంగా విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. అయితే చెట్టుకొమ్మలు పడడంతో విద్యుత్ వైర్లు



విద్యుత్ పునురుద్ధరణ పనులు చేపడుతున్న ట్రాన్స్ కో అధికారులు, (ఇన్‌సెట్లో) విద్యుత్ వైర్లపై వేలాడుతున్న చెట్టుకొమ్మ

తెగిపడి వాటి పరిధిలో ఉన్న పోలీసుస్టేషన్, కొత్త బస్టాండ్, దుర్గపేట, మెయిన్‌రోడ్డులో కొన్ని గృహాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గురువారం మధ్యాహ్నం 12 గంటల నుంచి విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టి రెండు కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వైర్లు సరిచేసి గురువారం సాయంత్రం 5 గంటలకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. వీరఘట్టం టౌన్‌కు విద్యుత్ సరఫరా లేకపోవడంతో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

శాఖాపరంగా సిబ్బంది సమస్యల పరిష్కారం

- ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: జిల్లా పోలీస్ శాఖలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తున్నామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కార్యాలయంలో జూమ్ సమావేశం ద్వారా పోలీస్ వెల్ఫేర్‌డే (గ్రీవెన్స్‌డే)కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని పలు పోలీస్‌శాఖ ప్రధాన కార్యాలయాలు, స్టేషన్ల అధికారులతో ఒక్కొక్కరి జూమ్ సమావేశం ద్వారా సమస్యలను తెలుసుకుని వాటన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారం దిశగా ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ తెలిపారు. సిబ్బంది సమస్యల పరిష్కారానికి అవకాశం ఉన్న వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. ఈ సమావేశంలో ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, ఎస్‌బీ సీఐ రంగనాథం, సైబర్ సెల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్పీ సీఐ రమేష్, ఏఆర్‌ఐలు నాయుడు, రాంబాబు, ఏఓ సతీష్, సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, శంకరరావు, సీసీ సంతోష్, డీపీఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పోలీసు వెల్ఫేర్‌డే సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

సహాయక చర్యలందక వ్యక్తి మృతి



ధనుంజయ మృతదేహం

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట పరిధిలో బుధవారం ప్రమాదవశాత్తు కింద పడిపోయిన వ్యక్తికి సకాలంలో సహాయక చర్యలందక పోవడంతో మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండల పరిధిలోని నాయుడువలస పంచాయతీ మధుర గ్రామం కొండపాలవలసకు చెందిన లెంక ధనుంజయ(33)ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తుంటాడు. రోజులాగానే బుధవారం కూడా ట్రాక్టర్ తోలడానికి వెళ్లిపోయి అదే మండలం ఆరికతోట గ్రామ పొలంలో మొక్కజొన్న కంకులు రెండు లోడులు పెరిగాడు. మూడో లోడుకు వెళ్లకుండా పొలంలో ట్రాక్టర్ వదిలేసి చెట్ల నీడకు వెళ్దామన్న ఉద్దేశంతో అక్కడికి కొద్ది దూరంలో ఉన్న నీలగిరి తోటలోకి వెళ్తుండగా తోటలో గతంలో నరికిన చెట్ల మొదళ్లు తన్నుకుని కంకర రోడ్డులో బోర్లా పడిపోయాడు. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పాటు ఎండవేడిమి ఎక్కువగా ఉండడంతో వెంటనే సహాయక చర్యలందక మృతిచెందాడు. బుధవారం రాత్రికి కూడా ధనుంజయ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. మద్యం తాగే అలవాటు ఉన్నోడు కదా ఏదో టైమ్‌లో ఇంటికి వచ్చే



ధనుంజయ (ఫైల్)

స్తాడులే అన్న ఉద్దేశంతో అలా వదిలేశారు. ట్రాక్టర్ ఓనర్ కూడా వెతికి తన ట్రాక్టర్‌ను తీసుకెళ్లిపోయాడు. గురువారం ఉదయం వరకు ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు ట్రాక్టర్ వదిలేసిన పరిసరాల్లో మళ్లీ వెతికారు. అయినా కనిపించకపోవడంతో తిరిగి ఇంటికి వెళ్లిపోతున్న సమయంలో ఆరికతోట గ్రామానికి చెందిన ఓ రైతు గడ్డిమోపు పట్టుకుని కనిపించి నీలగిరి తోటలో ఎవరో పడి ఉన్నారని చెప్పాడు. దీంతో కుటుంబ సభ్యులు వెళ్లి అప్పటికే మృతిచెంది ఉన్న ధనంజయను చూసి అవాక్కయ్యారు. బోర్లా పడి ఉన్న మృతదేహం ముఖంపై రక్తం మరకలు ఉండడం చూసి ఎలా మృతి చెంది ఉంటాడు? ఎవరైనా చంపి పడేశారా? మృతుడికి ఎవరూ శత్రువులు లేరే అని ఆలోచించి అనుమానాస్పద మృతిగా భావించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై వి. ప్రసాదరావు సిబ్బందితో కలిసి ఘటనా చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్‌ను రప్పించి సాధారణ మృతా? లేక హత్యా? అని పరిశీలించి సాధారణ మృతిగా నిర్ధారించారు.కుటుంబ సభ్యుల సమక్షంలో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాడంగి సీహెచ్‌సీకి తరలించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడి భార్య గౌరీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య గౌరీశ్వరి, పాప, బాబు ఉన్నారు.

ముర్రుపాలు అమూల్యం

- కలెక్టర్ బీఆర్ అంబేద్కర్



గర్భిణికి సీమంతం నిర్వహిస్తున్న మహిళలు, పాల్గొన్న కలెక్టర్ బీఆర్ అంబేద్కర్

విజయనగరం ఫోర్ట్: బిడ్డ పుట్టిన ఐదు నిమిషాల లోపు తల్లి ఇచ్చే ముర్రుపాలు ఎంతో అమూల్యమైనవని కలెక్టర్ బీఆర్ అంబేద్కర్ అన్నారు. ఆ పాలలో అద్భుతమైన పోషకాలు, ఔషధ గుణాలు ఉంటాయని, అవి బిడ్డ ఎదుగుదలకు ఉపయోగపడతాయన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ముగింపు కార్యక్రమం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తల్లిపాల గొప్పదనం గురించి నిత్యం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మహిళకు దీని గురించి వివరించాలన్నారు. మహిళలు బిడ్డకు పాలు అందించేందుకు బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్, కలెక్టరేట్‌లలో బ్రెస్ట్ ఫీడింగ్ సెంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే ఉన్నట్లయితే వాటిని పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామన్నారు. బ్రెస్ట్ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ తల్లి కావడమే గొప్ప అదృష్టమన్నారు. బిడ్డ పుట్టిన వెంటనే పాలు అందించడం తల్లి బిడ్డలిద్దరికీ శ్రేయస్కరమన్నారు. ఆ తర్వాత గర్భిణులకు సామూహిక సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ 5వ స్టాండింగ్ కమిటీ చైర్‌పర్సన్ శాంతికుమారి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ హిమబిందు, ఐసీడీఎస్ పీడీ విమలారాణి, డీఎల్‌ఓ డాక్టర్ రాణి, సాంఘిక సంక్షేమ శాఖ అధికారిణి అన్నపూర్ణ, బీసీ సంక్షేమ శాఖ అధికారిణి జ్యోతి శ్రీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, నేచర్ సంస్థ డైరెక్టర్ వికాస్ బాలరాజ్, ఘోషా ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ సుజాత పాల్గొన్నారు.

10న జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.శ్రీనివాస్, కార్యదర్శి జి.లక్ష్మణరావులు గురువారం తెలిపారు. ఆ రోజు ఉదయం 7 గంటల నుంచి ఎల్‌కోట మండల కేంద్రంలో గల మోడల్ స్కూల్ ప్రాంగణంలో సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2010 జనవరి 2వ తేదీ అనంతరం, జూనియర్స్ విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 2006 జనవరి 2వ తేదీ అనంతరం జన్మించిన వారై ఉండాలన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొన బోయే క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్ ,స్టడీ సర్టిఫికెట్లు వెంట తీసుకురావాలని సూచించారు. ఆ రోజు జిల్లా జట్లలోకి అర్హత సాధించిన క్రీడాకారులు త్వరలో ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 90524 57201, 95818 86936 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- రహదారులపై అక్రమణలు తొలగించాలి
- జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

విజయనగరం అర్బన్: రహదారులపై ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలని రహదారులపై ఆక్రమణలు తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశం గురువారం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రహదారిపై ప్రమాదాల నివారణకు చేపట్టవలసిన చర్యలు తీసుకోవడమే కాకుండా నిబంధనలను కఠినంగా అమలు చేయాలన్నారు. రహదారులు, జంక్షన్‌లు, బ్లాక్ స్పాట్స్, పాఠశాలల వద్ద ఆక్రమణలను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఐఆర్‌ఏడీ యాప్‌లో రోడ్డు ప్రమాద వివరాలను నమోదు చేయాలని తెలిపారు. ఐఆర్‌ఏడీ యాప్‌పై అన్ని శాఖల అవగాహన కోసం జూమ్ మీటింగ్ నిర్వహించాలని సూచించారు. రోడ్లు భవనాలు, పోలీసు, రవాణా, పంచాయతీరాజ్ శాఖల సంయుక్త బృందాలు ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గత సమావేశం నుంచి ఇప్పటివరకు పెండింగ్ ఉన్న కేసులను తక్షణమే క్లియర్ చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ సౌమ్యలత, రహదారులు భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.కాంతిమతి, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి, విజయనగరం మున్సిపల్ కమిషనర్ నల్లనయ్య, బొబ్బిలి మున్సిపల్ కమిషనర్ రామలక్ష్మి, ఎంవీఐ మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్

యువకుడి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన శివకుమార్ (ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

సీతంపేట: స్థానిక సొండివీధికి చెందిన నల్లా శివకుమార్ (34) గురువారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై వై.అమ్మన్నరావు తెలిపారు. ఒడిశాలోని గజపతి జిల్లా రసూరుకు చెందిన జ్యోతితో ఏడాది కిందట శివకుమార్‌కు వివాహం జరిగింది. తల్లిదండ్రులు వెంకట్, విజయలక్ష్మితో పాటు శివకుమార్, భార్య జ్యోతి ఒకే ఇంట్లో నివాసముంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్ షాప్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్న వారింట్లో ఇటీవల కుటుంబ తగాదాలు ఎక్కువవడంతో ఈ ఘాతుకానికి పాల్పడినట్లు సమాచారం. క్షణికావేశంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడగా ఇంటికి వచ్చి చూసిన తండ్రి వెంకటరావు వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి ఆటోలో తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు. మృతదేహానికి పోస్టు మార్టం నిర్వహించారు.

పురుగు మందు తాగి వ్యక్తి..



ఎండ చిరంజీవి మృతదేహం

గజపతినగరం రూరల్: మండలంలోని ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన ఎండ.చిరంజీవి పురుగు మందు తాగి జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు గజపతినగరం ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విలేకరులతో ఆయన మాట్లాడుతూ మృతుడి తండ్రి చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చిరంజీవి నిత్యం మద్యం తాగుతూ తరచూ ఇంట్లో భార్యతో గొడవపడేవాడన్నారు. ఈ క్రమంలో బుధవారం రాత్రి మద్యం తాగి ఇంటికి రాగా భార్యతో గొడవ పడడంతో ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉన్న పురుగు మందును తాగేశాడు. స్థానికుల సాయంతో కుటుంబసభ్యులు జిల్లా కేంద్రాస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.